క్లుప్తంగా

టౌన్ బ్యాంక్‌లో ఆయుధపూజ

తిరుపతి మంగళం: తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్)లో శుక్రవారం చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, మహ్మద్ ఖాసీం (చోటాబాయ్), కడపగుంట అమరనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, బ్యాంక్ ఎంపీ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హేమలతకు డాక్టరేట్



తిరుపతి తుడా: స్విమ్స్ ఫిజియోథెరపీ విద్యార్థిని సీఎస్ హేమలతకు డాక్టరేట్ ప్రకటించారు. ఆమె ప్రొఫెసర్ శాంతి పర్యవేక్షణలో టైప్–2 డయాబెటిస్‌కు సంబంధించి పరిశోధన పత్రాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేద పండితులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం యాగశాలకు వేంచేపు చేసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్లకు వివిధ వైదిక కార్యక్రమాలు, ఆ తర్వాత ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొదలచిన గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. వారికి ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి

తిరుపతి సిటీ: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని రిమ్స్ ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాలలో ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ పోటీ ప్రపంచంలో ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శభాష్ డాక్టర్!



కంటి ఆపరేషన్లు చేయించుకున్న రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటాచలం

తిరుపతి తుడా: శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్ ఆప్తమాలజీ విభాగంలో ఈనెల 10 నుంచి శుక్రవారం వరకు నిర్వహించిన పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు పూర్తి అయ్యాయని డైరెక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వెంకటాచలం దాదాపు 700 మందికి ఓపీలు చూడడంతో పాటు 70మందికి ఆపరేషన్లు చేశారని ఆయన సేవలను ప్రస్తుతించారు. అనంతరం అధికారులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

నేడు శ్రీహథీరాం బావాజీ బర్సి దివాస్



మాట్లాడుతున్న అమ్ము నాయక్

తిరుపతి కల్చరల్: స్థానిక గాంధీరోడ్డులోని హథీరాం బావాజీ మఠంలో శనివారం హథీరాం బావాజీ బర్సి దివాస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు బంజారా మహంత్ శ్రీ హథీరాం బావాజీ మహాసంఘ అధ్యక్షుడు అమ్ము నాయక్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి బంజారా సామాజిక వర్గానికి చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులు, సాధు సన్యాసులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మఠం నుంచి అలిపిరి వరకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. 19వ తేదీన తిరుమల హథీరాం బావాజీ మఠంలో కూడా ఇదే భోగ్ భండార్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. బంజారాలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఈశ్వర్ నాయక్, గణేష్ దాస్ మహరాజ్, రమేష్‌గిరి మహరాజ్, విఠల్ మహరాజ్, కృష్ణ నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నారా రోహిత్

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటుడు నారా రోహిత్ దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

టెన్షన్..తత్కాల్ రిజర్వేషన్

- వెయిటింగ్..నో క్లియర్
- పరీక్షిస్తున్న ఐఆర్‌సీటీసీ



తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అన్నమయ్య సర్కిల్: దీపావళి పండుగకు రైళ్లకు తాకిడి ఉండటం పరిపాటే. దీనిని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ పండుగ కోసం ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. అయితే టికెట్టు రిజర్వేషన్‌కు సంబంధించి, అలాగే తత్కాల్ కోసం ప్రయత్నిస్తున్న వారి సహనానికి ఐఆర్‌సీటీసీ పరీక్ష పెడుతోంది. ముందుగా రిజర్వేషన్ చేసుకున్న వారికీ ఇప్పటికీ వెయిటింగ్ లిస్టు క్లియర్ కాలేదు. మరోవైపు అధిక ధరలు ఇప్పుడు ప్రయాణికులను టెన్షన్ పెడుతోంది. ఇప్పటికే ప్రధాన రైళ్లల్లో రిజర్వేషన్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి మూడు రోజుల పాటు వరుస సెలవులు, దీపావళి పండుగ కావడంతో ముందు రోజు నుంచే తత్కాల్ రిజర్వేషన్ కోసం వేల సంఖ్యలో ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ఓపెన్ చేయగా షాక్ అయ్యారు. సైట్ తెరుచుకోకపోవడంతో పలువురు తమ సమస్యను రిపోర్ట్ చేస్తున్నారు. తాజాగా తత్కాల్‌తో ఆధార్ అనుసంధానం వేళల్లో మార్పులతో కొంత సమస్యగా మారింది. ఇదే సమయంలో పండుగ వేళ సైట్ ఓపెన్ కాకపోవటం, రిజర్వేషన్లు కాకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రైల్వే శాఖ మరిన్ని అదనపు సర్వీసులను ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు.

ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు

పండుగను అవకాశంగా తీసుకుని ప్రత్యేక బస్సులు సైతం అదనపు చార్జీలతో దోపిడీకి దిగాయి. ప్రైవేటు బస్సుల్లో ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. అలాగే విమాన టికెట్ల బుకింగ్ కూడా గత ఏడాది దీపావళితో పోలిస్తే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం పెరిగిందని ట్రావెల్ ఏజెంట్లు చెప్పారు. కాగా 65 నుంచి 70 శాతం విహార యాత్రలకు పెంచినట్లు సమాచారం. పరిస్థితి ఇలా ఉంటే అదనపు రైళ్లను ఏర్పాటు చేసి ప్రయోజనం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. కాగా అందరూ రైల్వే శాఖ అధికారుల నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు.



ప్రత్యేక రైలు, ఐఆర్‌సీటీసీ లోగో (ఫైల్)

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ముసాయిదా వద్దు



పీడీఎస్‌ఓ మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి సిటీ: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ముసాయిదాను తక్షణం ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌ఓ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక యూత్ హాస్టల్‌లో పీడీఎస్‌ఓ జిల్లా మహాసభ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ, యూజీసీ ప్రతిపాదించిన లెర్నింగ్ ఔట్‌కమ్ బేస్డ్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ (ఎల్‌ఓసీఎఫ్) ముసాయిదా ఉన్నత విద్యారంగంలో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోందన్నారు. ఇది విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై నేరుగా దాడి చేసే చర్య అని నిరసించారు. ప్రభుత్వం ప్రజా వైద్య విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ భాగస్వామ్య విధానాన్ని ప్రోత్సహించడం శోచనీయమని మండిపడ్డారు. 17 కొత్త మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో కొనసాగిస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, జీవో 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్వీయూకు చెందిన డాక్టర్ డి. గోవిందులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు మోహన్ దాస్, దేవేంద్ర తదితరులు మాట్లాడారు. ఈ మహాసభలో పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షునిగా వి.దేవేంద్ర, కార్యదర్శిగా ఆర్.ఆషా, సభ్యులుగా స్రవంతి, బాలాజి, పవన్, ఇమ్మాన్యుయేల్, అజయ్ తదితరులను ఎన్నుకున్నారు. తొలుత 200 మంది విద్యార్థులతో ఎంఆర్ పల్లె సర్కిల్ నుంచి యూత్ హాస్టల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

నూతన ఎస్వీవీయూ అధికారులకు సత్కారం



చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర పశు వైద్య కళాశాలలో కొత్తగా నియమితులైన అధికారులను ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గంగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన డీన్ ఆర్వీ. సురేష్ కుమార్, సీఏఈ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ, డీఎస్‌ఏ డాక్టర్ వైకుంఠ రావును అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో డెయిర్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ విజయగీత, డెయిరీ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ రాజశేఖర్, డెయిరీ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ మంజునాథ, ఓఎస్‌ఏ స్ఫూర్తి, రవివర్మ, డాక్టర్ అనూష, రాము, డాక్టర్ అనుపమ, భావన, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏ జాబితా ఇవ్వండి

తిరుపతి సిటీ: నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను త్వరితగతిన ఇవ్వాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. 2002 ఓటర్ల జాబితాను 2025 జాబితాతో మ్యాపింగ్ చేయగానే 10.7 శాతం ఓటర్లను గుర్తించామన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

– ఏర్పాట్లను పరిశీలించిన జేఈవో వీరబ్రహ్మం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

చంద్రగిరి: తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు నవంబర్ 15 లోపు ఏర్పాట్లు చేయాలని టీటీడీ అధికారులకు జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. నవంబరు 17 నుంచి 25వరకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం జేఈవో టీటీడీ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీ నేపథ్యంలో ముందస్తుగా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చలువపందిళ్లు, రంగోళీలు, క్యూలైన్లు, బారికేడ్లు తదితర ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. శుక్రవారపు తోటలో పుష్పప్రదర్శనశాలతోపాటు ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు చేపట్టాలన్నారు. భక్తులకు సరిపడా తాత్కాలిక, మొబైల్ మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలని, మెరుగ్గా పారిశుద్ధ్యం ఉండాలని జేఈవో సూచించారు. టీటీడీ నిఘా, భద్రతా అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పంచమితీర్థం రోజున విశేషంగా వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సెల్వం, ఎస్ఈలు శ్రీ వేంకటేశ్వర్లు, శ్రీ జగదీశ్వర్ రెడ్డి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

అలరించిన 'యువ తరంగ్'



గీతాలాపన చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రెండ్రోజులుగా నిర్వహిస్తు న్న యువ తరంగ్– 2025 విద్యార్థుల సాంస్కృతిక కా ర్యక్రమాలతో ఆకట్టుకుంటోంది. శుక్రవారం సాంస్కృతిక పోటీలు జోరుగా హుషారుగా సాగాయి. ఇండియ న్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ సోలో ఇ న్‌స్ట్రుమెంట్, ఇండియన్ క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, ట్రైబల్ డాన్స్‌తోపాటు వక్తృత్వం, చర్చాగోష్టి, స్పాట్ పెయింటింగ్, కార్టూన్స్ వేయడం తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చర్ అఫైర్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, స్వరూప్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, న్యాయ నిర్ణేతలు పర్యవేక్షించారు.

పోటీల్లో నేడు : శనివారం మిమిక్రీ, మైమ్, స్కిట్, ఏకాంకిక, ఫోక్ ఆర్కెస్ట్రా, క్రియేటివ్ కొరియోగ్రఫీ, క్విజ్, క్లే మోడలింగ్, రంగోలి పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అప్పులతో అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, అధికారులు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా రూ.50 కోట్లతో నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులను వేగంగా చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక 35వ వార్డు భవానినగర్‌లో సుమారు రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ కాలువలను శుక్రవారం ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ మౌర్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు చెవిరెడ్డి కుటుంబం ప్రత్యేక పూజలు

- ఏసీబీ కోర్టులో బెయిల్ పిటీషన్‌పై ముగిసిన వాదనలు
- ఈనెల 24న తీర్పు వెల్లడి



ఆలయంలో వేద ఆశీర్వచనం తీసుకుంటున్న చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : అక్రమ మద్యం కేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని 122 రోజులుగా జైలులో నిర్బంధించారు. ఆయనకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని కోరుతూ చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి శుక్రవారం విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. చెవిరెడ్డి పేరిట అర్చన చేయించి ఆయనకు మంచి జరగాలని, కూటమి ప్రభుత్వ రాజకీయ కక్షలతో పెట్టిన అక్రమ కేసుల నుంచి విముక్తి కలిగించాలని మొక్కుకున్నారు. అనంతరం కోర్టుకు చేరుకున్నారు. ఇదలా ఉంచితే, ఇరుపక్షాల వాదనలు విన్న విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 24 వరకు తీర్పును రిజర్వు చేశారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఆర్.గణేష్ తెలిపిన వివరాల మేరకు.. 2019 డిసెంబర్ 5న ములకలచెరువు పోలీసులు మదనపల్లె–కదిరి రోడ్డు తంబేపల్లె క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మదనపల్లె నుంచి ఓ టాటా సుమో వాహనాన్ని పోలీసులు నిలిపారు. వాహనం దిగి ఇద్దరు పారిపోవడానికి యత్నించగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. వారిద్దరూ కర్ణాటక వాసులు నారాయణప్ప శివకుమార్, సుబ్రహ్మణ్యం మంజునాథ్ అని తేలింది. వాహనంలో 162 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలను ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు తుది విచారణకు రాగా నిరూపితం కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చంద్రగిరి: పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్న ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. తిరుచానూరుకు చెందిన భార్గవ్ కొన్ని రోజులుగా తిరుచానూరు పరిసరాల్లో గుట్టుగా పేకాట ఆడిస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి మార్గంలోని భార్గవ్ హోం స్టే సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ సునీల్ కుమార్ తన బృందంతో ఆ స్థావరంపై దాడులు చేశారు. భార్గవ్‌తో పాటు 18 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.63లక్షలు స్వాధీనం చేసుకున్నారు. భార్గవ్‌పై గతంలోనూ పేకాటపై పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం కోర్టుకు తరలించారు.

50 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

తిరుపతి క్రైం: రెండు వేర్వేరు ఘటనల్లో 50 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్‌జీ.హేమాద్రి తెలిపారు. వివరాలు.. శుక్రవారం తిరుపతిలోని నాలుగుకాళ్ల మండపం వద్ద జీ.విజయ్‌కుమార్(అనంతపురం జిల్లా), జలగంవాళ్ల నాగరాజు(అన్నమయ్య జిల్లా), టంగుటూరు అంజనేయప్రసాద్(గుంటూరు జిల్లా) 30 టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తుండగా పోలీసులు కాపుగాసి వారిని పట్టుకున్నారు. అలాగే డీఆర్ మహల్ రోడ్డులోని గాంధీపురం శివాలయం వెనుక 20 టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తుండగా ప్రకాశం జిల్లా వాసి వల్లేటి రమణారావు, శివారెడ్డి (నంద్యాల జిల్లా) పట్టుకున్నారు నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

కర్నూలు మోదీ సభకు ప్రజాధనం వృథా

తిరుపతి కల్చరల్: కర్నూలులో ప్రధానమంత్రి మోదీ గబ్బర్‌సింగ్ ట్యాక్స్ సభలా సాగిందని తిరుపతి మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ వ్యంగంగా అన్నారు. దీనికి సీఎం చంద్రబాబు 15 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం దుర్మార్గమని విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చాలా బలహీనంగా ఉందన్నారు. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. పైగా, జీఎస్టీపై మరిన్ని సభలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జీఎస్టీ తగ్గిందని ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వం ఇండ్లీ, కాఫీ, టీలు, పెట్రోల్, డీజిల్, బస్ చార్జీలు..మొదలైన వాటిని ఎక్కడ తగ్గించిందని సూటిగా ప్రశ్నించారు. ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు అని హామీ ఇచ్చిన మోదీ వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు శాంతి యాదవ్, తేజోవతి, మునిశోభ, సమీవుల్లా, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఇవేం 'యువ తరంగ్' కమిటీలు..?

–సంబంధం లేని వ్యక్తుల నియమించారని ఎస్‌ఎఫ్‌ఐ మండిపాటు



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూకు సంబంధంలేని వ్యక్తులను యువతరంగ్ కమిటీలలో నియమించి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంగా మార్చారని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విమర్శించారు. శుక్రవారం రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం ఇచ్చి వారు మాట్లాడారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగి వివేక్ చౌదరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస ఆడిటోరియంలో నృత్యం చేస్తున్న పొలిటికల్ సైన్స్ విద్యార్థులను మధ్యలోనే ఆపించి వారిని అవమానానికి గురయ్యేలా కో–ఆర్డినేటర్ ప్రవర్తించడం హేయమని, దీనిని ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో గొడవకు దిగడం సిగ్గుచేటని నిరసించారు. అంతేకాకుండా గురువారం మధ్యాహ్నం మిగిలిన బిర్యానీని అదే రోజు రాత్రి విద్యార్థులకు పెట్టారని మండిపడ్డారు. గత ఏడాది చదువు పూర్తయిన బీటెక్ విద్యార్థికి ప్రధాన బాధ్యతలు అప్పగించారని, దీనిని ప్రశ్నించిన లా విద్యార్థి మీద దాడికి ఉసిగొల్పడం శోచనీయమన్నారు. గత ఏడాది నుంచి కల్చరల్ కో–ఆర్డినేటర్ చేసిన కార్యక్రమాలకు సంబంధించి బిల్లులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీల కో–ఆర్డినేటర్ అశోక్, వర్సిటీ కార్యదర్శి వినోద్, తకార్యవర్గ సభ్యులు వాసు, షేక్ షా, తిప్పేస్వామి, ధను, విజయ్ పాల్గొన్నారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ గోడలకు సుగంధ ద్రవ్యాలను ప్రోక్షణ చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈనెల 20న దీపావళి ఆస్థానం నేపథ్యంలో శుక్రవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి మొదలైన వాటిని నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆ తర్వాత ఉదయం 10.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

5న యోగుల పర్వతంపై కార్తీక దీపోత్సవం



కార్తీక దీపోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రామచంద్రాపురం మండలంలోని యోగుల పర్వతంపై నవంబర్ 5న ఘనంగా కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్టు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి తెలిపారు. శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి సమీపంలోని నేరేళ్లమ్మ ఆలయం వద్ద ఆయన భక్తులతో కలిసి కార్తీక దీపోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజున యోగుల పర్వతంపై 1,503 కిలోల ఆవు నెయ్యి, 2007 మీటర్ల వొత్తులు, ఆరడుగుల కొప్పెరతో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్.రాజా, సభ్యులు సుబ్రమణ్యంరెడ్డి, మునేంద్రరెడ్డి, సాయి, విగ్రహాల కల్యాణి, పద్మనాభం, చెంగారెడ్డి, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



పింక్ బస్సు వద్ద స్విమ్స్ సిబ్బంది, లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరానికి మంచి స్పందన లభించింది. స్విమ్స్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించాయి. పింక్ బస్‌లో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, రీజినల్ చైర్మన్ పర్సన్ రామయ్య, నాగూర్‌బాషా, ఆర్వీ.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ జయరామనాయుడు, దొరస్వామినాయుడు, దామోదర్ నాయుడు, కృష్ణమూర్తినాయుడు, ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు, వైద్యులు చైతన్యభాను, పీఆర్వో చంద్రమోహన్, ఆంజనేయులు, ఆదికేశవులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

–జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి కల్చరల్: ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. సామాజిక మాధ్యమాలను కూడా మంచి పనుల కోసం వినియోగించాలని ఆయన కోరారు. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో పలువురు సీనియర్ జర్నలిస్టులకు సత్కార సభ నిర్వహించారు. జిల్లా ఎస్పీతో పాటు డాక్టర్ గౌరవరం సుబ్రమణ్యశర్మ ముఖ్య అతిథులుగా, విశిష్ట అతిథిగా శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, విశ్రాంత అధ్యాపకుడు కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నారాయణ స్వామి హాజరై ప్రసంగించారు. ఎప్పటికప్పుడు వివిధ సంఘటలను ప్రజల ముందుంచడంలో మీడియా ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, విశ్రాంత పాత్రికేయులు, కవులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.